## ఈవీఎం చిట్టాలు మూడేండ్లు భద్రపరచాలి

### సుప్రీంకోర్టుకు సిబల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఈవీఎం చిట్టా(లాగ్స్)లను కనీసం 2-3 ఏండ్ల పాటు భద్రపరచాలని, ప్రతి దశ ఓటింగ్ తర్వాత కౌంటింగ్ లోపు ఆయా దశల పోలింగ్ రికార్డులను వెల్లడించాలని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ కోరారు. ఈ మేరకు ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరారు. తద్వారా ఏ ఎంపీ 'చట్టవిరుద్ధంగా' ఎన్నిక కాలేరన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. 'ఫామ్ 17సిని ఈసీ తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయకపోతే ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయో ప్రజలకు తెలియదు. ఫలితాలు వెలువడి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎవరూ ఏమీ చేయలేరు' అని సిబల్ అన్నారు. ఓటింగ్ శాతం ఎలా పెరిగిందో, గణాంకాలను సవరించినప్పుడు అదెలా పెరుగుతుందో ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారని ఆయన అన్నారు.







## ప్రజ్వల్‌కు విదేశాంగ శాఖ షోకాజ్ నోటీస్

### స్పందించకపోతే దౌత్య పాస్‌పోర్ట్ రద్దు

న్యూఢిల్లీ, మే 24: సెక్స్ స్కాండల్ కేసులో నిందితుడైన హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు కేంద్ర విదేశాంగ శాఖ శుక్రవారం షోకాజ్ నోటీస్ జారీ చేసింది. దౌత్య పాస్‌పోర్ట్‌ను ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలని ఆయనను కోరింది. కొన్ని రోజుల్లోగా స్పందన తెలపకపోతే.. పాస్‌పోర్ట్‌ను రద్దు చేస్తామని.. దాని వల్ల విమాన ప్రయాణానికి అనర్హులవుతారని తెలిపింది. తమ నోటీస్‌కు ప్రజ్వల్ స్పందించకపోతే.. ప్రస్తుతం ఆయన ఉన్న దేశంలోని పోలీసులు ఆయనను కస్టడీలోకి తీసుకొని భారత్‌కు తరలించే అవకాశం ఉన్నదని విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి.

# 58 సీట్లు.. 889 మంది అభ్యర్థులు

- నేడు లోక్‌సభ ఎన్నికల ఆరో దశ పోలింగ్
- ఆరు రాష్ట్రాలు.. రెండు యూటీల్లో ఎన్నికలు
- బరిలో ఖట్టర్, మేనకాగాంధీ, ముఫ్తీ

న్యూఢిల్లీ, మే 24: సార్వత్రిక ఎన్నికల ఆరో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. శనివారం ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. 5.84 కోట్ల మంది పురుషులు, 5.29 కోట్ల మంది మహిళలు, 5,120 మంది థర్డ్ జెండర్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 889 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఢిల్లీలోని ఏడు, హర్యానాలోని మొత్తం 10 స్థానాలకు ఇదే విడతలో ఎన్నికలు పూర్తి కానున్నాయి.

**హస్తినలో హోరాహోరీ**

ఢిల్లీలోని మొత్తం ఏడు లోక్‌సభ స్థానాలకు ఈ విడతలోనే పోలింగ్ జరగనుంది. 1.52 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గత రెండు ఎన్నికల్లో బీజేపీ ఇక్కడ క్లీన్‌స్వీప్ చేయగా ఈసారి ఆప్ – కాంగ్రెస్ కలిసికట్టుగా బీజేపీని ఎదుర్కొంటున్నాయి. నాలుగు స్థానాల్లో ఆప్, మూడు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సహా ఆప్ నేతల అరెస్టు ప్రభావం ఈ ఎన్నికలపై పడొచ్చు. బీజేపీ తరఫున సుష్మా స్వరాజ్ కూతురు బన్సూరి స్వరాజ్, కాంగ్రెస్ తరఫున జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్ తదితరులు పోటీలో ఉన్నారు.





**జంగల్ మహల్‌లో దంగల్**

తృణమూల్ కాంగ్రెస్ – బీజేపీ మధ్య తీవ్రస్థాయిలో పోటీ ఉన్న పశ్చిమ బెంగాల్‌లో.. గిరిజన ప్రాంతమైన జంగల్ మహల్‌లోని ఎనిమిది స్థానాలకు పోలింగ్ జరగనుంది. 1.45 కోట్ల మంది ఓటర్లు 79 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

యూపీలో 14 స్థానాలు

బీజేపీకి, ఇండియా కూటమికి కీలక రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ ప్రాంతంలో ఉన్న 14 నియోజకవర్గాలకు ఆరో విడతలో పోలింగ్ జరగనుంది. 162 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బీజేపీకి సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు గట్టి పోటీ ఇస్తుండగా, బీఎస్పీ పొందే ఓట్లు గెలుపోటములను నిర్ణయించే అవకాశం ఉంది.

**హర్యానాలో ఒకే విడతలో..**

బీజేపీ పాలిత రాష్ట్రమైన హర్యానాలోని 10 లోక్‌సభ స్థానాలకు ఈ దశలో ఎన్నికలు జరగనున్నాయి. 223 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీజేపీ తరఫున కేంద్రమంత్రులు రావ్ ఇందర్‌జిత్ సింగ్, కిషన్ పాల్ గుర్జార్, మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కాంగ్రెస్ సీనియర్ నేతలు కుమారి శెల్జా, దీపేందర్ సింగ్ హుడా, తదితరులు ఎన్నికల బరిలో నిలిచారు.

**జార్ఖండ్‌లో నాలుగు స్థానాలు**

జార్ఖండ్‌లోని గిరిడిహ్, ధన్‌బాద్, రాంచి, జంషెడ్‌పూర్ స్థానాలకు ఆరో విడతలో ఎన్నికలు జరగనుండగా 93 మంది పోటీలో ఉన్నారు. 82.16 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బీజేపీ, కాంగ్రెస్ – జేఎంఎంతో కూడిన ఇండియా కూటమి మధ్య ఇక్కడ పోటీ ఉంది.

**బీహార్‌లో ఎనిమిది స్థానాలకు హోరాహోరీ**

బీహార్‌లో ఎనిమిది లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అన్ని స్థానాల్లోనూ ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య ద్విముఖ పోటీ నెలకొన్నది. మొత్తం 1.49 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.

**ఒడిశాలోని నాలుగు స్థానాల్లో..**

బిజు జనతాదళ్(బీజేడీ), బీజేపీ మధ్య తీవ్ర పోటీ ఉన్న ఒడిశాలో ఆరో దశలో ఆరు లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్ కూడా బరిలో ఉన్నప్పటికీ మెజారిటీ స్థానాల్లో ప్రధానంగా బీజేడీ, బీజేపీ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నెలకొన్నది. లోక్‌సభ స్థానాలతో పాటు 42 అసెంబ్లీ స్థానాలకు సైతం ఎన్నికలు జరగనున్నాయి.


– జమ్ము కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ – రాజౌరీ స్థానానికి మూడో విడతలో ఎన్నిక జరగాల్సి ఉన్నా వాతావరణ ప్రతికూలతల వల్ల ఆరో దశలో జరుగుతున్నది. ఇక్కడ పీడీపీ నుంచి మాజీ సీఎం మహబూబా ముఫ్తీ బరిలో ఉన్నారు.

# ఇంకో 23 ఏండ్లు నేనే!

- 2047 వరకు కష్టపడతా
- వికసిత్ భారత్ కోసం శ్రమిస్తా
- ఈ కార్యం పూర్తిచేయడానికే దేవుడు నన్ను పంపించాడు
- ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యలు
- 75 ఏండ్ల రిటైర్మెంట్ రూల్ తనకు వర్తించదని పరోక్షంగా సంకేతాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): బీజేపీలో కొనసాగుతున్న 75 ఏండ్ల రిటైర్మెంట్ గడువు ఒకవైపు ముంచుకొస్తున్నది. ఎన్నికల ఫలితాలు ఎలా వస్తాయోనన్న ఆందోళన మరోవైపు నిలకడగా ఉండనివ్వట్లేదు. వెరసి ఇంతకాలం తన మనసులో దాచిపెట్టుకొన్న పదవీ ఆకాంక్షను ప్రధాని నరేంద్ర మోదీ ఎట్టకేలకు బయటపెట్టారు. ఇంకో 23 ఏండ్లపాటు తాను క్రియాశీల రాజకీయాల్లోనే ఉంటానని స్పష్టం చేశారు. ఇందుకోసం 'వికసిత్ భారత్' నినాదాన్ని ముందరేసుకొన్నారు. ఈ మేరకు 'ఇండియా టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని కీలక విషయాలు వెల్లడించారు.



**జబ్ తక్.. వాపస్ నహీ బులాయేంగే**

''వికసిత్ భారత్' కల నెరవేర్చడం కోసం 2047 వరకు నిరంతరాయంగా శ్రమించే బాధ్యతను దేవుడు నా మీద పెట్టాడు. ఈ కార్యాన్ని పూర్తిచేయడానికే నన్ను భూమి మీదకు పంపించాడని నాకు అనిపిస్తున్నది. దీని కోసం దేవుడు నాకు దారిచూపించి, శక్తిని ఇచ్చాడు. 2047 కల్లా వికసిత్ భారత్ లక్ష్యాన్ని నేను నెరవేరుస్తానన్న నమ్మకం నాకున్నది. అది నెరవేర్చే వరకు దేవుడు నన్ను పైకి పిలువడు' అని పేర్కొన్నారు. ప్రస్తుతం మోదీ వయసు 74 ఏండ్లు. తాజా వ్యాఖ్యల ద్వారా మరో రెండు దశాబ్దాలకు పైగా తాను దేశ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉంటానని ఆయన పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అంతేకాదు, 75 ఏండ్లకు బీజేపీలో రిటైర్మెంట్ నిబంధన అనేది తనకు వర్తించబోదని ఆయన ఒకరకంగా చెప్పినట్టేనని అభిప్రాయపడుతున్నారు.

# మద్యం పాలసీ కేసు ఫేక్

### మోదీనే ఈ విషయం అంగీకరించారు:కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మే 24: ఢిల్లీ మద్యం పాలసీ కేసు పూర్తిగా ఫేక్ అనే విషయాన్ని ప్రధాని మోదీనే అంగీకరించారని, ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థలు అరెస్టు చేసిన వాళ్లు త్వరలో బయటకు వస్తారని సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. శుక్రవారం మీడియాతో వర్చువల్‌గా మాట్లాడుతూ మోదీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ''కేజ్రీవాల్ ఒక 'అనుభవం ఉన్న దొంగ'. ఈ కేసులో ఒక్క ఆధారం కూడా లభ్యం కాలేదు'' అంటూ పేర్కొన్నారని కేజ్రీవాల్ తెలిపారు. తన తప్పుడు అరెస్టును కప్పిపుచ్చేందుకు మోదీ తనను ఉద్దేశించి ఆ విధమైన వ్యాఖ్యలు చేశారని అన్నారు. ఢిల్లీ మద్యం కేసులో తనతోపాటు చాలా మందిని అరెస్టు చేశారని, దేశవ్యాప్తంగా 500కుపైగా ప్రాంతాల్లో సోదాలు చేశారని, అయినా బీజేపీ నేతలు చెబుతున్న స్కామ్‌లో ఒక్క రూపాయి కూడా అక్రమ సొమ్మును గుర్తించలేదన్నారు. బీజేపీలో వారసత్వ పోరు తీవ్రంగా ఉన్నదని, తన వారసుడిగా, తన తర్వాత ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు హోంమంత్రి అమిత్‌షాకు మోదీ మార్గం సుగమం చేస్తున్నారని చెప్పారు.

# ఓటింగ్ శాతంపై ఈసీని ఆదేశించలేం

- పోలింగ్ కేంద్రాల వారీగా వెల్లడించాలని పిటిషన్
- రెగ్యులర్ బెంచ్‌కి బదిలీ చేసిన వెకేషన్ బెంచ్

న్యూఢిల్లీ, మే 24: పోలైన ఓట్ల శాతాన్ని పోలింగ్ కేంద్రాల వారీగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని ఆదేశించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల సమయంలో ఇప్పుడు ఇలాంటి ఆదేశాలు ఇస్తే అవసరమైన మానవ వనరులను సమకూర్చుకోవడం ఎన్నికల సంఘానికి కష్టమవుతుందని పేర్కొన్నది. ఇప్పటికే ఐదు దశలు పూర్తికాగా, ఇంకా రెండు దశలు మాత్రమే మిగిలి ఉందని కోర్టు గుర్తు చేసింది. ఏయే పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయో తెలిపే ఫామ్ 17సీ మొదటి భాగాన్ని ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫామ్స్(ఏడీఆర్) దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ విచారించింది. ఇందులోని విజ్ఞాపనలు.. 2019 నుంచి కోర్టులో పెండింగ్‌లో ఉన్న మరో పిటిషన్‌లో కోరిన అంశాలుగానే కనిపిస్తున్నాయని కోర్టు పేర్కొన్నది. ఏడీఆర్ పిటిషన్‌ను ఎన్నికల తర్వాత విచారించేలా రెగ్యులర్ బెంచ్‌కు బదిలీ చేసింది. కాగా, ఫామ్ 17సీ మొదటి భాగాన్ని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే ఓటర్లలో గందరగోళం నెలకొంటుందని,ఇప్పటికే సుప్రీంలో ఈసీ అఫిడవిట్ దాఖలుచేసిన సంగతి తెలిసిందే.



*రంగులు దిద్దుకుంటున్న ఈ పాఠశాల కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా బెల్తంగడి పట్టణంలోనిది. కొన్ని రోజుల క్రితం ఇది పూర్తిగా శిథిలావస్థలో ఉండేది. ఏ క్షణమైనా కూలిపోయేలా ఉందని, మరమ్మతులు జరిపించాలని విద్యార్థులు ఎంతగా మొరపెట్టుకున్నా కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోలేదు. దీంతో కొన్ని స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టు యూనియన్ ముందుకొచ్చి పాఠశాలకు మరమ్మతులు చేశాయి.*



## కృష్ణ ఎల్లాకు జాన్స్ హాప్‌కిన్స్ అవార్డు

న్యూఢిల్లీ, మే 24: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ, కొవిడ్ వ్యాక్సిన్ కొవాగ్జిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లాకు అరుదైన గౌరవం దక్కింది. ఆయనకు జాన్స్ హాప్‌కిన్స్ బ్లూమ్‌బర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నుంచి ప్రతిష్ఠాత్మక పురస్కారం 'డీన్స్ మెడల్' వరించింది. ఈ మేరకు అవార్డును డీన్ ఎల్లెన్ జే మెకెంజీ కృష్ణ ఎల్లాకు అందజేశారు. అమెరికాలోని మేరీలాండ్ రాష్ట్రం బాల్టిమోర్ పట్టణంలో ఈ నెల 22న జరిగిన బ్లూమ్‌బర్గ్ స్కూల్ స్నాతకోత్సవంలో అవార్డును అందించారని భారత్ బయోటెక్ పేర్కొన్నది.

**దేశానికి అంకితం: డాక్టర్ ఎల్లా**

తనకు జాన్స్ హాప్‌కిన్స్ బ్లూమ్‌బర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అవార్డు అందజేయడంపై డాక్టర్ కృష్ణ ఎల్లా ఆనందం వ్యక్తం చేశారు. తనకు దక్కిన పురస్కారాన్ని సైన్స్ పురోగతిలో ఘన విజయం సాధించిన భారతదేశానికి అంకితం చేస్తున్నానని ప్రకటనలో పేర్కొన్నారు.

# అదానీ బొగ్గుపై నిగ్గు తేల్చాలి!

- డీఆర్ఐ పెండింగ్ కేసును త్వరితగతిన పరిష్కరించాలి
- సీజేఐను కోరుతూ 21 అంతర్జాతీయ సంస్థల లేఖ
- ఇండోనేషియా దిగుమతి బొగ్గు అధిక ధరల కథేంటి?
- సంచలనంగా మారిన ఫైనాన్సియల్ టైమ్స్ కథనం



న్యూఢిల్లీ, మే 24: అదానీ తాజా బొగ్గు స్కామ్‌పై అంతర్జాతీయ మీడియా సంస్థ ఫైనాన్సియల్ టైమ్స్ కథనం ప్రకంపనలు సృష్టిస్తున్నది. 2013లో ఇండోనేషియా నుంచి తక్కువ రకానికి చెందిన బొగ్గును దిగుమతి చేసుకొన్న అదానీ కంపెనీ.. దాన్ని హైగ్రేడ్ క్వాలిటీగా బురిడీ కొట్టించి తమిళనాడులోని ఓ ప్రభుత్వ విద్యుత్తు సంస్థకు అమ్మిన వైనం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అదానీ సంస్థ బొగ్గు కొనుగోలు వ్యవహారంపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) పెండింగ్ కేసుపై విచారణ పూర్తి చేయాలని కోరుతూ 21 అంతర్జాతీయ సంస్థలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు తాజాగా లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. అదానీ కంపెనీ ఇండోనేషియా బొగ్గు దిగుమతి చేసుకొని, దాన్ని దేశంలో అధిక ధరలకు విక్రయించారన్న ఆరోపణలపై నిగ్గు తేల్చాలని అభ్యర్థించాయి. అదానీ బొగ్గు కహానీపై ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు(ఓసీసీఆర్‌పీ) పత్రాలను ఉటంకిస్తూ ఫైనాన్సియల్ టైమ్స్ కథనం ఇచ్చిన నేపథ్యంలో సీజేఐకి అంతర్జాతీయ సంస్థలు ఈ లేఖ రాశాయి.

**తాజా, వివరణాత్మక ఆధారాలు..**

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కు లేఖ రాసిన 21 అంతర్జాతీయ సంస్థల్లో ఆస్ట్రేలియన్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ జస్టిస్, బ్యాంక్‌ట్రాక్, బాబ్ బ్రౌడ్ ఫౌండేషన్, కల్చర్ అన్‌స్టెయినుడ్, ఇకో, ఎక్స్‌టిన్షన్ రెబలియన్, లండన్ మైనింగ్ నెట్‌వర్క్, ఫ్రెండ్స్ ఆఫ్ ది ఎర్త్ ఆస్ట్రేలియా, మెకే కన్జర్వేషన్ గ్రూప్, మార్కెట్ ఫోర్సెస్, మనీ రెబలియన్, మూవ్ బియాండ్ కోల్, సీనియర్స్ ఫర్ క్లైమేట్ యాక్షన్ నౌ, స్టాండ్.ఎర్త్, స్టాప్ అదానీ, సన్‌రైజ్ మూవ్‌మెంట్, టిప్పింగ్ పాయింట్, టాక్సిక్ బాండ్స్, ట్రాన్స్‌రెన్సీ ఇంటర్నేషనల్ ఆస్ట్రేలియా, డబ్ల్యూ అండ్ జె నగాన యార్‌బైన్ కల్చరల్ కస్టోడియన్స్, క్వీన్స్ లాండ్ కంజర్వేషన్ కౌన్సిల్ ఉన్నాయి. శిలాజ ఇంధనాల నిరంతర వినియోగానికి వ్యతిరేకంగా తాము గట్టిగా నిలబడుతామని ఈ సంస్థలు లేఖలో పేర్కొన్నాయి. అదానీ సంస్థ తక్కువ నాణ్యత బొగ్గును తమిళనాడుకు చెందిన టీఏఎన్‌జీఈడీసీవోకు అధిక ధరకు అమ్మిన వైనానికి సంబంధించి ఫైనాన్సియల్ టైమ్స్ తాజా, వివరణాత్మక ఆధారాలు ఇచ్చిందని తెలిపాయి.

### జేపీసీ వేయాలని విపక్షాల డిమాండ్

తాజా బొగ్గు స్కామ్ ఆరోపణలను అదానీ గ్రూప్ ఖండిస్తున్నది. అయితే ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణ వేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సందర్భంగా విపక్షాలు ఫైనాన్సియల్ టైమ్స్ రిపోర్టును ఉటంకిస్తున్నాయి. కాగా, బొగ్గు దిగుమతుల అధిక ధరల ఆరోపణలపై అదానీ గ్రూప్‌పై విచారణను పునఃప్రారంభించాలన్న తన వైఖరిని పునరుద్ఘాటిస్తూ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) కూడా ఇటీవల సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చింది. 2011 నుంచి 2015 మధ్య అదానీ గ్రూపు కంపెనీలు ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకొన్న బొగ్గుకు సంబంధించి డీఆర్ఐ 2016లో దర్యాప్తును ప్రారంభించింది.

## కొడవలితో భార్య పొట్టను కోసిన కసాయి

### శిశువు లింగత్వాన్ని తెలుసుకునేందుకు దారుణం

లక్నో, మే 24: ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్‌లో పన్నాలాల్ అనే ఓ వ్యక్తి తన భార్య అనిత జన్మనివ్వబోతున్న శిశువు లింగత్వాన్ని తెలుసుకునేందుకు కొడవలితో ఆమెపై దాడిచేసి పొట్టను కోసేశాడు. అత్యంత దారుణమైన ఈ ఘటన 2020 సెప్టెంబర్‌లో జరిగింది. దీంతో ఆ కర్కోటకుడికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. 22 ఏండ్ల క్రితం పెండ్లి చేసుకున్న ఆ దంపతులకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. అయినప్పటికీ మగబిడ్డ కోసం వారిద్దరూ తరచూ ఘర్షణ పడేవారు. అనితకు విడాకులిస్తానని, మగబిడ్డ కోసం మరో మహిళను పెండ్లి చేసుకుంటానని పన్నాలాల్ బెదిరించసాగాడు. ఈ క్రమంలో అనిత మరోసారి గర్భం దాల్చడంతో ఆమె గర్భంలో పెరుగుతున్న శిశువు ఆడా, మగా అన్నదానిపై ఇరువురి మధ్య మళ్లీ గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన పన్నాలాల్ 8 నెలల గర్భంతో ఉన్న అనితను బలంగా ఒడిసి పట్టి, కొడవలితో ఆమె పొట్టను కోసేశాడు. అనంతరం పేగులు వేలాడుతున్న స్థితిలో అనిత బాధతో అరుస్తూ వీధిలోకి పరుగెత్తింది. ఘటనా స్థలం నుంచి పన్నాలాల్ పారిపోయాడు. అనిత ప్రాణాలతో బయటపడింది. కానీ, ఆమె గర్భంలో ఉన్న మగబిడ్డను మాత్రం వైద్యులు కాపాడలేకపోయారు.





## పేటీఎంలో 6 వేల ఉద్యోగాల కోత

*నోయిడా, మే 24: పేటీఎం మాతృ సంస్థ అయిన వన్ 97 కమ్యూనికేషన్స్‌లో 15 నుంచి 20 శాతం సిబ్బందిని తొలగించవచ్చని ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ వెల్లడించింది. దీని ప్రకారం 5 వేల నుంచి 6,300 మంది ఉద్యోగులను ఇంటికి పంపే అవకాశం ఉంది. వ్యయ నియంత్రణ, లాభదాయకత పెంపులో భాగంగా చేపట్టే ఈ తొలగింపుల కారణంగా రూ.400-500 కోట్లు ఆదా అవుతుందని ఆ సంస్థ భావిస్తున్నది. ఇప్పటికే తొలగింపును ప్రారంభించారని, డిసెంబర్‌లో 1,000 మందిని ఉద్యోగాల నుంచి తీసేశారని తెలిసింది.*

## ఏఐతో ఇక ఉద్యోగాలు ఐచ్ఛికమే

- అన్ని పనులూ ఏఐ, రోబోలు చేసేస్తాయి..
- టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ అంచనా



పారిస్, మే 24: కృత్రిమ మేధ(ఏఐ)పై టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు చేశారు. వివాటెక్ 2024లో సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఏఐ వినియోగం వేగంగా విస్తరిస్తున్నందున ఇక భవిష్యత్తులో ఉద్యోగాలు కేవలం ఐచ్ఛికంగా మారిపోతాయని పేర్కొన్నారు. ఎవరైనా వ్యక్తులు ఉద్యోగాలను అలవాటుగా చేయాలనుకుంటే చేయవచ్చని, ఒకవేళ ఉద్యోగాలు చేయకపోయినా ఏఐ, రోబోలే మనకు కావాల్సిన అన్ని వస్తువులు, సేవలను అందిస్తాయని ఆయన అంచనా వేశారు. ఏఐతో మానవాళికి మేలు జరగాలంటే ఏఐ టూల్స్ నిజాలు మాత్రమే చెప్పేలా సిద్ధం చేయాలని ఆయన పేర్కొన్నారు. చాట్‌జీపీటీని రూపొందించిన ఓపెన్‌ఏఐ సంస్థ పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

**డీడీ కిసాన్‌లో ఏఐ యాంకర్లు**

దేశ చరిత్రలోనే తొలిసారిగా ఓ ప్రభుత్వ టీవీ చానెల్‌లో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత న్యూస్ యాంకర్లు రంగ ప్రవేశం చేయనున్నారు. రైతుల కోసం ప్రారంభించిన డీడీ కిసాన్ చానెల్‌కు తొమ్మిది సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో దూరదర్శన్ కీలక నిర్ణయం తీసుకొన్నది. ఈ కృత్రిమ మేధ ఆధారిత న్యూస్ యాంకర్లకు ఏఐ క్రిష్, ఏఐ భూమి అని పేర్లు పెట్టారు. ఈనెల 26 నుంచి వీటి చేత వార్తలు చదివిస్తారు.



## 15 ఏండ్ల బాలునికి సెయింట్‌హుడ్

*లండన్: బ్రిటన్‌లో జన్మించిన కార్లో ఆక్యుటిస్ (15) కేథలిక్ చర్చ్ సెయింట్ కాబోతున్నాడు. 2006లో లుకేమియా వ్యాధితో ఆక్యుటిస్ మరణించాడు. అతి చిన్న వయసు నుంచే అతడు కంప్యూటర్ వాడకంలో పట్టు సంపాదించాడు. 'గాడ్స్ ఇన్‌ఫ్లుయెన్సర్'గా అందరికీ సుపరిచితుడయ్యాడు. 1990వ దశకంలో జన్మించిన వారికి సెయింట్‌హుడ్ రావడం ఇదే మొదటిసారి. అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఏడేళ్ల బాలుడు ఆక్యుటిస్ వాడిన టీ-షర్టుల్లో ఒకదానిని ముట్టుకోవడంతో, అకస్మాత్తుగా ఆ వ్యాధి నుంచి విముక్తి పొందినట్లు వార్తలు వచ్చాయి.*

## 100 మందికిపైగా సజీవ సమాధి



*నైరుతి పసిఫిక్‌లోని ద్వీప దేశమైన పపువా న్యూ గినియాలో తీవ్ర ప్రకృతి విపత్తు సంభవించింది. ఓ గ్రామంలో కొండచరియలు విరిగి పడటంతో వంద మందికిపైగా మృతి చెందగా, వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. రాజధాని పోర్ట్‌మోర్స్‌బీకి 600 కిలోమీటర్ల దూరంలోని ఎంగా ప్రావిన్స్‌లోని కవోకలామ్ గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున మూడు గంటలకు ఈ ప్రమాదం జరిగింది. అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో కొండచరియలు కింద పడి చాలామంది మరణించారని, మృతుల సంఖ్య వందకంటే ఎక్కువే ఉంటుందని అధికారులు తెలిపారు.*


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

**టి. ప్రకటన నం .C/E.29/Elec/M/SC/06/DL/OT/2024-25 తేది.23.05.2024** PUB/0493

భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారు దిగువ ఇచ్చిన పని కొరకు **14-06-2024న 15.00 గంటల** వరకు ఇ-టెండరు కోరుచున్నారు.

**క్ర.సం. 01. ఇ-టెండరు నెం.:** ఇ-టెండరు నెం. C/E.29/Elec/M/SC/06/DL/OT/2024-25. ఇ-టెండరు నెం. E-M-SC-06-OT-2024-25. **పని పేరు:** సికింద్రాబాద్ డివిజన్-విద్యుత్ నిర్వహణ శాఖ-KZJ-BPQ సెక్షన్-KZJ-BPQ సెక్షన్‌లో ట్రిప్లింగ్ పనులకు సంబంధించి స్టాఫ్ క్వార్టర్ల ప్రతిపాదిత నిర్మాణం-విద్యుత్ సౌకర్యాలు. **టెండరు విలువ (రూ.):** 3,46,39,953.52. **బయానా (రూ.):** 3,23,200.00. **CTF (రూ.):** 0.00. **పూర్తిచేయు కాలం:** 6 నెలలు.

**సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (M)/సికింద్రాబాద్**

**టెండరు ప్రకటన నం :8-CWMLGDS-ET-2024-25. తేది : 23.05.2024** PUB/0494

భారత రాష్ట్రపతి తరపున వ్యవహరిస్తున్న CWM/LGDS వారు టెండరు నెం. 8-CWMLGDS-ET-2024-25, ముగింపు తేది 13.06.2024 15.00 గం.వరకు కలిగిన దాని కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు. ముగింపు తేది మరియు సమయం వరకు మాత్రమే బిడ్డర్లు తమ ఒరిజినల్/మార్పు చేయబడిన బిడ్డు దాఖలు చేయగలరు. ఈ టెండరు కొరకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు ఏవేని అట్టి మాన్యువల్ ఆఫరు స్వీకరించినను అది వదలివేయబడును.

కాంట్రాక్టర్లు నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ మొ. వంటి IREPS పోర్టల్‌లో లభించే **ఆన్‌లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే** టెండరు డాక్యుమెంటు ధర మరియు బయానా నిమిత్తం ఈ టెండరుపై చెల్లింపులు చేసేందుకు అనుమతించబడతారు. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రిసీప్ట్‌లు, FDR మొదలగు వాటి ద్వారా మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.

**క్ర.సం.**01 **టెండరు నం.** 8-CWMLGDS-ET-2024-25 తేది: 23-05-2024, **పని వివరణ:** క్యారేజ్ వర్క్‌షాప్, లాలాగూడ, సికింద్రాబాద్ వద్ద BG కోచ్‌లను ART/ARME లోకి మార్చుట. **సుమారు వ్యయం:** రూ. 59,72,520.92 (యాభై తొమ్మిది లక్షల డెబ్బై రెండు వేల ఐదు వందల ఇరవై రూపాయల తొంభై రెండు పైసలు మాత్రమే), **బయానా:** రూ.1,19,500/- (ఒక లక్ష పంతొమ్మిది వేల ఐదు వందల రూపాయలు మాత్రమే), **పూర్తిచేయు కాలం:** 10 నెలలు, **ముగింపు తేది:** 13-06-2024న 15.00 గం. వరకు.

1. **వెబ్‌సైట్ వివరాలు : www.ireps.gov.in**
2. **టెండరు పూర్తి వివరాలు చూసేందుకు నోటీస్ బోర్డ్ ఉంచు ప్రదేశం:** చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ వర్క్‌షాప్, లాలాగూడ, సికింద్రాబాద్-500017.

**చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, CWS, లాలాగూడ, సికింద్రాబాద్**

**ఇ-టెండరు నం .B-SG-CN-SNT-GNT-2-2024-25 తేది.24.05.2024** PUB/0495

భారత రాష్ట్రపతి తరపున సిగ్నల్ అండ్ టెలికాం (నిర్మాణం), దక్షిణ మధ్య రైల్వే, GNT @ విజయవాడ వారు దిగువ పని కొరకు ఓపెన్ టెండరు/ సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుచున్నారు.

**క్ర.సం.**01, **టెండరు ప్రకటన నం.** B-SG-CN-SNT-GNT-2-2024-25, **తేది:** 24-05-2024, **పని పేరు:** ద.మ. రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో విజయవాడ నార్త్ ఈస్ట్ క్యాబిన్ (VNEC) నుండి రాయనపాడు (RYP) సెక్షన్‌లో ప్రతిపాదిత బై-పాస్ లైన్ రైల్ ఓవర్ రైల్ (ROR) పని దృష్ట్యా రాయనపాడు వద్ద ప్రస్తుతమున్న డిస్ట్రిబ్యూటెడ్ ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ (హాట్ స్టాండ్‌బై) కు MACLS ఇండోర్ అండ్ అవుట్ డోర్‌లో మార్పులు. **టెండరు విలువ:** రూ. 6,96,54,584.07 పై., **పూర్తిచేయు కాలం:** 09 నెలలు, **ముగింపు తేది మరియు సమయం:** 18-06-2024న 11.00 గం. వరకు.

1. బిడ్ డాక్యుమెంటు మరియు ఇతర వివరాల కొరకు దయచేసి వెబ్‌సైట్ https://ireps.gov.in కు లాగిన్ కండి.
2. టెండరు దాఖలుచేయు /బిడ్డింగ్ కాలవ్యవధిలో అనగా టెండరు ముగింపుకు ముందస్తుగా పదిహేను రోజులలోగా టెండరుదారులు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చెయ్యాలి.
3. టెండరు దాఖలుచేయు /బిడ్డింగ్ కాలవ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు టెండరుదారులు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌పై మాత్రమే జారీచెయ్యబడును) కొరకు గమనించగలరు.

**డిప్యూటీ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజినీర్ (నిర్మాణం) GNT @ విజయవాడ**

A0627

**తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.**